ప్రజాశక్తి

గురువారం 29 జూన్ 2023

మైనారిటీ కార్పొరేషన్ ఇడిగా లావణ్య

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర మైనారిటీ ఆర్థిక సంస్థ ప్రాంతీయ కార్యనిర్వాహక డైరక్టర్‌గా ఎం.లావణ్య అదనపు బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆమె జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిగా ఉన్నారు. మైనారిటీ కార్పొరేషన్ ఇడిగా ఇప్పటి వరకూ వ్యవహరించిన ఎం.లక్ష్మి తన మాతృసంస్థకు బదిలీపై వెళ్లడంతో తాను బాధ్యతలు చేపట్టినట్టు ఇడి ఎం.లావణ్య ఒక ప్రకటనలో తెలిపారు.

పశుగణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ గా బంగారు నాయుడు

జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ గా బెల్లాన బంగారునాయుడును ప్రభుత్వం నియమించింది. ఆయనతో పాటు డైరెక్టర్ గా గుంటుబారికి లక్ష్మణ నియమితులయ్యారు. వారిని విజయనగరం డివిజన్ పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వై వి రమణ అభినందించారు.

బహిరంగసభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

మన్యానికి మెడికల్ కాలేజీ

- అర్హులందరికీ ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలు
- ఐదు ఐటిడిఎ కేంద్రాల్లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు
- వచ్చేనెలలో గిరిజన వర్శిటీకి శంకుస్థాపన
- ఈ ఏడాది నుంచి మెడికల్ కళాశాల అడ్మిషన్లు
- పది రోజులపాటు పండగలా అమ్మఒడి కార్యక్రమాలు
- ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి /కురుపాం/ గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తామని, విజయనగరం మెడికల్ కాలేజీలో ఈ ఏడాది నుంచి అడ్మిషన్లు ప్రారంభిస్తామని సిఎం జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎలు సహా రాష్ట్ర వ్యాప్తంగావున్న ఐదు ఐటిడిఎ కేంద్రాల్లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. జులైలో గిరిజన యూనివర్శిటీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు. గిరిజన ప్రాంతంలో అర్హులందరికీ ఆర్ఒఎఫ్ఆర్ డికెటి పట్టాలు మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. అమ్మఒడి కార్యక్రమం పది రోజులపాటు పండగ వాతావరణంలో జరుగుతుందని, ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కురుపాం మండలం కేంద్రంలో బుధవారం ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సిఎం జగన్మోహన్‌రెడ్డి ల్యాబ్‌టాప్‌లో బటన్ నొక్కి నాలుగో విడత అమ్మఒడి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల తల్లుల ఖాతాలకు నగదు జమ చేశారు. ఈ సందర్భంగా సభలో ఆయన మాట్లాడుతూ గిరిజనులను తమ ప్రభుత్వం గుండెల్లో పెట్టుకుని పనిచేస్తుందని అన్నారు. డిప్యూటీ సిఎం పదవి కూడా గిరిజనులకే కేటాయించామని గుర్తుచేశారు. గిరిజన ప్రాంతంలో కమ్యూనికేషన్ వ్యవస్థను మెరుగుపర్చేందుకు ఎక్కడికక్కడ సెల్‌ఫోన్ టవర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతంలో 2600 టవర్లు ఏర్పాటు చేయగా అందులో 118 కురుపాం ఏజెన్సీలో ఉన్నాయన్నారు. గిరిజనులకు సకాలంలో మెరుగైన ఆధునిక వైద్యసేవలు అందించాలన్న సంకల్పంతో ఏజెన్సీ ప్రాంతాల్లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులతోపాటు మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ జిల్లాలోని సింగపురంలో మినీ రిజర్వాయర్ కోసం రూ.38 కోట్లు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి, ఎత్తిపోతల ప్రాజెక్ట్, క్రాసింగ్ నెట్ ప్లాంట్‌ను కూడా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే పుష్పశ్రీవాణితో పాటు సాలూరు ఎమ్మెల్యే పీడిక రాజన్నదొరకు డిప్యూటీ సిఎం పదవులు కట్టబెట్టామని గుర్తుచేశారు. మన్యం జిల్లాలో ఇప్పటి వరకు 3,62,737 ఆర్ఒఎఫ్ఆర్ డికెటి పట్టాలు మంజూరు చేశామని, పట్టాలు ఇచ్చిన వారందరికీ రైతు బరోసా పథకాన్ని కూడా వర్తింపజేశామని వివరిం చారు.

ఉద్యోగ కల్పనలోనూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.30 లక్షల మందికి గ్రామ సచివాలయాల్లో ఉద్యోగాలు కల్పించగా, వారిలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు 84 శాతం వరకు ఉన్నారని అన్నారు. చంద్రబాబు 14ఏళ్లు సిఎంగా పనిచేసి ఏ ఒక్క సామాజికవర్గానికి కూడా మేలు చేయలేదని విమర్శించారు. తాము అమలు చేస్తున్న పథకాలకు ఓర్వలేక లేనిపోని అబద్ధాలతో ప్రజల్ని మోసం చేస్తున్నారని అన్నారు. ప్యాకేజీ స్టార్ మాదిరిగా తాము తొడలు కొడుతూ చెప్పులు చూపించలేమన్నారు. తమకు ప్రజాపునాదులు ఉన్నాయని, అవి తన పాదయాత్ర నుంచి బలపడుతూ వస్తున్నాయని అన్నారు.

విద్యార్థుల ఇబ్బంది పడకూడదనే అమ్మఒడి : బొత్స

రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ డబ్బుల్లేక ఏ విద్యార్థి ఇబ్బందులు పడకూడదని, తమ పిల్లలను బడికి పంపించే తల్లులకు భరోసా కల్పిస్తూ అమ్మఒడి పథకాన్ని రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తుందని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. పదిరోజుల పాటు పండుగ వాతావరణంలో తల్లుల ఖాతాలలో నిధులు జమవుతాయని తెలిపారు. విద్యా రంగంలో మన రాష్ట్రంలో విద్యకు అమలు చేస్తున్న పథకాలను ఇతర రాష్ట్రాల వారు అమలు చేసేందుకు అధ్యయనం చేస్తున్నారన్నారు. విద్యారంగంలో డిజిటల్ విధానాన్ని అమలు చేస్తూ బైజూస్ కంటెంట్ తో ట్యాబ్ లు పంపిణీ చేసినట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్యతో ప్రభుత్వ పాఠశాలలలో చదువుకున్న విద్యార్థులు ప్రైవేటు విద్యాసంస్థలకు పోటీగా రాష్ట్రస్థాయి ర్యాంకులు, ప్రవేశ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ప్రజలకు కావాల్సిన నాలుగు ప్రోజెక్టులు మంజూరు చేయాలని, గుమ్మడిగెడ్డ మినీ రిజర్వాయరు, గరుగుబిల్లి వద్ద వంతెన, జంఝావతి నదిపై ఉల్లభద్ర వద్ద లిఫ్ట్ ఇరిగేషను ప్రాజెక్టు, జీడి పప్పు ప్రోసెసింగు యూనిట్ మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు.

కలెక్టరు నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 85 వేల మంది తల్లులకు రూ.129 కోట్లు అమ్మఒడి నాలుగో విడత నిధులు అందజేస్తున్నట్లు తెలిపారు. నాడు- నేడు కార్యక్రమం మొదటి విడతలో 486 పాఠశాలల్లో రూ.111 కోట్లుతో పనులు పూర్తిచేశామని, రెండో విడత 545 పాఠశాలల్లో రూ.145 కోట్లతో పనులు జరుగుతున్నట్లు తెలిపారు. జిల్లాలో 10వేల మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి గొడ్డేటి మాధవి, బెల్లాన చంద్రశేఖర్, పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, ఇంటర్మీడియెట్ విద్య కమిషనరు సౌరభ్‌గౌర్, పాఠశాల మౌలిక వసతులు కమిషనరు కె.భాస్కర్, జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావు, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెలు విశ్వసరాయి కళావతి, అలజంగి జోగారావు, ఎస్.చినవెంకట అప్పలనాయుడు, బడుకొండ అప్పలనాయుడు, కంబాల జోగులు, టిడ్కో చెర్మన్ జె. ప్రసన్నకుమార్, ఐటిడిఎ ప్రోజెక్టు అధికార్లు సి.విష్ణు చరణ్, కల్పనా కుమారి, పాలకొండ సబ్ కలెక్టరు నూరుల్ కమర్, అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

హెలీపాడ్ నుండి సభావేదిక వద్దకు వచ్చే మార్గంలో ముఖ్య మంత్రికి ప్రజలు పూలతో స్వాగతం పలికారు. రోడ్ షోలో సిఎంకు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన తప్పెట గుళ్ళు, సవర, కోలాట నత్యం, సిరంతాన్ నృత్యం, సభావేదిక వద్ద ఏర్పాటు చేసిన రేలారేలారే, ధింసా నృత్యం,శివశ్రీ నత్య నికేతన్ వారి నాట్య కార్యక్రమాలు ప్రజలను అలరించాయి.

ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించిన సిఎం

కార్యక్రమానికి ముందుగా ముఖ్యమంత్రి లబ్దిదారులతో ఫోటో దిగిన అనంతరం, జిల్లాకు సాధించిన అవార్డులు, ప్రగతిపై ఏర్పాటుచేసిన ఫోటోఎగ్జిబిషన్‌ను తిలకించారు. జాతీయ ఉత్తమపంచాయతీ అవార్డు 2023, పదవ తరగతి ఉత్తీర్ణత ఫలితాలు, ప్రాథమిక మౌలిక సదుపాయాల కల్పనలో నీతి ఆయోగ్ మొదటి స్థానం, సాలూరు మున్సిపాలిటీ స్వచ్ఛ సర్వేక్షన్ 2022, ఆయుష్మాన్ ఉత్కృష్ట పురష్కార్-2022 అవార్డులు, మారుమూల ప్రాంతాలకు మొబైల్ కనెక్టివిటీ, ఆర్ఒఎఫ్ ఆర్ భూముల అభివృద్ధి గురించి జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ ముఖ్యమంత్రికి వివరించారు.

18మందికి చెక్కులు పంపిణీ

ముఖ్య మంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిసి అర్జీలు సమర్పించిన 18 మందికి సిఎం వెంటనే నిధులు మంజూరు చేశారు. వెంటనే రూ.4 లక్షల విలువ గల చెక్కులను ఉప ముఖ్యమంత్రి, ఇతర ప్రజా ప్రతినిధులు, కలెక్టర్ అందజేశారు. మిగిలిన వారికి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పంపిణీ చేశారు.

సిఎంకు ఘన స్వాగతం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి హెలీపాడ్ వద్ద జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. చినమేరంగి పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలీపాడ్‌కు ఆయన చేరుకున్నారు. ముఖ్యమంత్రితో పాటు జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి, రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్ నాథ్ ఉన్నారు. ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికిన వారిలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర, విజయనగరం జిల్లా పరిషత్ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, పార్లమెంటు సభ్యులు జి.మాధవి, బెల్లాన చంద్ర శేఖర్, రాష్ట్ర విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యేలు పి.పుష్పశ్రీవాణి, అలజంగి జోగారావు, విశ్వాసరాయి కళావతి, కంబాల జోగులు, శంబంగి చినప్పలనాయుడు, బడుకొండ అప్పలనాయుడు, జిసిసి ఛైర్మన్ స్వాతిరాణి, డిప్యూటీ మేయర్ కె.శ్రావణి, మాజీ ఎంపి, ఎమ్మెల్యే డివిజి శంకరరావు, పాలవలస రాజశేఖర్, హైమావతి, జయమణి, తదితరులు పాల్గొన్నారు.

సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

5న విశాఖలో ప్రాంతీయ సదస్సు : సిఐటియు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతై జులై 5న విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే ప్రాంతీయ సదస్సులో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొనాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు పిలుపునిచ్చారు. బుధవారం మధ్యాహ్నం ఎల్‌బిజి భవన్ సిఐటియు కార్యాలయంలో కె.రామచంద్ర రావు అధ్యక్షతన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ విజయనగరం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, 010 పద్దు ద్వారా జీతాలు, సమాన పనికి సమాన వేతనం, రిటైర్ అయిన మరణించిన కార్మికుల బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వాలని, విలీన ప్రాంత కార్మికులను కార్పొరేషన్ కార్మికులురగా గుర్తించాలని, ఇంజనీరింగ్, వాటర్ వర్క్స్ కార్మికులకు జీవో నెంబర్ 30 సవరించి టెక్నికల్ వేతనాలు చెల్లించాలని , క్లాప్ వాహన డ్రైవర్లకు రూ.18500 చెల్లించాలని తీర్మానం చేశారు. ఈనేపథ్యంలో నిర్వహించే సదస్సుకు ముఖ్య వక్తగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో సిఐటియు జిల్లా జిల్లా కార్యదర్శి జగన్మోహన్ రావు, విజయనగరం, బొబ్బిలి, రాజాం, నెల్లిమర్ల నుంచి వచ్చిన కార్మిక సంఘం నాయకులు, బాబురావు, రాజేష్, గౌరీ, రామారావు రామా నాయుడు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కౌలురైతులకు సాగుహక్కు పత్రాలు

జెసి మయూర్ అశోక్

ప్రజాశక్తి-విజయనగరం

అసలైన సాగు దార్లను గుర్తించి వారికి వివిధ ప్రభుత్వ పథకాలను అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకు ఈ ఏడాది 10,176 ల సాగు హక్కు ధ్రువీకరణ పత్రాలను ఇవ్వాలని నిర్ణయించామని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. అందులో భాగంగా ఇప్పటివరకు 4602 పత్రాలను ఇచ్చినట్లు తెలిపారు. రైతులు తాము సాగు చేస్తున్న గ్రామంలో ఈ కార్డును పొందటానికి అర్హులని,. భూ యజమాని తన కుటుంబీకులకు కౌలు కార్డులు ఇవ్వటానికి వీలు లేదని పేర్కొన్నారు. కొంత సొంత భూమి కల్గి వుండి, కొంత కౌలు చేస్తున్న రైతులు కూడా ఈ కార్డును పొందటానికి అర్హులని తెలిపారు. ఈ కార్డులు పొందిన రైతులు రైతు భరోసా తో పాటూ ప్రభుత్వ పథకాలైన పంటల భీమా, పంట నష్ట పరిహారం , వివిధ ప్రకృతి వైపరీత్యాల వలన పంట నష్టం తాలూకు పెట్టుబడి రాయితీని పొందేందుకు అర్హులని తెలిపారు. జిల్లాలోని కౌలు రైతులు (సాగుదారులు) తప్పకుండా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. భూ యజమాని నుంచి అంగీకార పత్రం, ఆధార్ కార్డు, మరియు కౌలు రైతు యొక్క ఆధార్ కార్డులు తీసుకొని ఆ గ్రామ విఆర్ఒను సంప్రదించాలని జెసి తెలిపారు.

అక్టోబరు 17 నుంచి ఓటర్ల జాబితా సవరణ

ప్రజాశక్తి-విజయనగరం

అక్టోబరు 17 నుంచి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని, తప్పులు లేని ఓటర్ల జాబితాను తాయారు చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అధికారులకు సూచించారు. అందుకోసం ముందస్తుగా ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలు, బిఎల్ఒలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. వారితో బుధవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఓటర్ల సవరణ ప్రక్రియ పై పలు సూచనలు జరీ చేసారు. జులై 21 నుంచి ఆగస్టు 21 వరకు బిఎల్ఓలు ఇంటింటి సర్వే నిర్వహించాలని, ఓటర్ల చిరునామాలు, పేర్లు, ఫోటోలు అన్నీ సరి చూడాలని, శత శాతం ఖచ్చితమైన, నమోదు జరగాలని సూచించారు. ఓటర్ల జాబితా నుండి పేర్లను తొలగించడం, చేర్చడం మొత్తం ప్రక్రియ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకే జరగాలని స్పష్టం చేసారు. డెత్ , షిఫ్టింగ్, ఓటర్లకు నోటీసులు జారీ చేసి తొలగించాలన్నారు. బిఎల్ఒల ఖాళీలను వెంటనే పూరించాలని సూచించారు.

రీ సర్వే వేగంగా జరగాలి

అన్ని గ్రామాల్లో జూలై నెలాఖరు నాటికీ రీ సర్వే ప్రక్రియ పూర్తి కావాలని కలెక్టర్ తెలిపారు. అవసరమగు చోట్ల రోవర్స్ ను అదనంగా కేటాయిస్తామని, సిబ్బంది ని కూడా పక్క మండలాల నుండి డెప్యుటేషన్ పై ఇవ్వడం జరుగుతుందని అన్నారు. రోజుకు కనీసం 100 ఎకరాలలో సర్వే పూర్తి కావాలని అన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్ఒ గణపతి రావు, సర్వేశాఖ ఎడి ఎస్ఎల్ఆర్ త్రివిక్రమ రావు , డిప్యూటీ కలెక్టర్లు , సూర్యనారాయణ, పద్మలత తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ వెళ్లి సర్వేచేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-గజపతినగరం

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటికీ వెళ్లి సర్వే చేయాలని, వారికి కావాల్సిన 11 రకాల సేవలపై ఆరా తీయాలని సచివాలయ సిబ్బందిని, వలంటీర్లను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. గజపతినగరం మండలం కొత్త బగ్గాం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఇంటింటి సర్వే ప్రక్రియను పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై లబ్దిదారులను ఆరా తీశారు. గ్రామస్తుల సమస్యలను తెలుసుకున్నారు. జలజీవన్ మిషన్ పనులను త్వరగా పూర్తిచేసి, త్రాగునీటి సరఫరాను మెరుగు పరుస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతీ ఇంటికీ వెళ్లి సర్వే నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. వారికి కావాల్సిన 11 రకాల సేవలను వివరించి, కావాల్సిన సర్టిఫికేట్లను అందజేయాలని సూచించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లను తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరును పరిశీలించారు. ముందుగా టోకెన్లు జారీ చేసి, వారికి కావాల్సిన ధ్రువపత్రాలను అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిఎల్‌డిఒ రవీంద్ర, తాహశీల్దార్ అరుణకుమారి, ఎంపిడిఒ కిషోర్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంగీత కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని మహరాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో సర్టిఫికేట్, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ కెవివిఎల్ఎన్ శాస్త్రి తెలిపారు. భారతీయ సంస్కృతి, కళల పట్ల అవగాహన కలిగించి ఆకర్షితులను చేసే ఉద్దేశంతో సంగీత కళాశాలలో 4 సంవత్సరాల సర్టిఫికెట్ కోర్సు, 2 సంవత్సరాల డిప్లొమా కోర్సులను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. సర్టిఫికెట్ కోర్సు ఉత్తీర్ణులైన వారు మాత్రమే డిప్లొమా కోర్సుకు అర్హులని వెల్లడించారు. గాత్రం, వీణ, వయోలిన్, నాదస్వరం, మదంగం, డోలు, భరతనాట్యం అంశాల్లో కోర్సులు వున్నాయని పేర్కొన్నారు. ప్రవేశానికి దరఖాస్తు చేయదలచిన అభ్యర్థుల వయస్సు జూలై 1, 2023 నాటికి 10 సంవత్సరాలు నిండి వుండాలని, 60 ఏళ్ల లోపు వయస్సు కలిగి వుండాలని తెలిపారు. డిప్లొమా కోర్సులో ప్రవేశానికి సంబంధిత సర్టిఫికెట్ కోర్సు ఉత్తీర్ణులైన వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. సర్టిఫికెట్ కోర్సులో చేరే విద్యార్థులు ఏడాదికి రూ.1500, డిప్లొమా కోర్సు విద్యార్థులు ఏడాదికి రూ.2000 ఫీజు చెల్లించాల్సి వుంటుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులంతా రూ.50 చెల్లించి కళాశాలలో దరఖాస్తులు పొందవచ్చన్నారు. సాధారణ రుసుముతో జూలై 1 నుంచి 31 వరకు ప్రవేశం పొందవచ్చని పేర్కొన్నారు. ఇతర సమాచారం కోసం కళాశాల ఫోన్ నెంబరు 08922 - 223751 ఫోన్ నెంబరులో సంప్రదించవచ్చని తెలిపారు. ఉదయం 7 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6.30 గంటల వరకు కళాశాలలో తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.

సప్లిమెంటరీ పరీక్ష ఫీజును తగ్గించాలి

ఎంఆర్ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ధర్నా

పుస్తక విక్రయాలపై శ్రీచైతన్య కళాశాల వద్ద నిరసన

ధర్నా చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎంఆర్ కళాశాలలో పెంచిన సప్లిమెంటరీ, రీవాల్యుయేషన్ ఫీజులు తగ్గించాలని, ప్రశ్నాపత్రాన్ని రెండు మాధ్యమాల్లో ముద్రించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన బుధవారం విద్యార్థులు కళాశాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.హర్ష మాట్లాడుతూ కళాశాలలో ఎన్నడూ లేని విధంగా అధిక మొత్తంలో అనుబంధం, పునః మూల్యాంకనం రుసుము వసూలు చేస్తున్నారని, దీని వలన విద్యార్థులు అధిక మొత్తంలో ఫీజులు చెల్లించాల్సి వస్తోందని అన్నారు. విద్యార్థులకు ఇస్తున్న పరీక్ష పత్రాలు ఒక్క ఆంగ్లంలోనే ముద్రించడం వలన విద్యార్థులు అర్థం చేసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారు. యుజిసి బోర్డు నిబంధనల ప్రకారం ప్రశ్న పత్రాలను ద్విభాషలలో ముద్రించాలని డిమాండ్ చేశారు. పెంచిన సప్లిమెంటరీ ఫీజులు పూర్వ పద్ధతిలో వసూలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కాని యెడల ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు జె.రవికుమార్ , ఎం.సౌమ్య, జిల్లా కమిటీ సభ్యులు పి.రమేష్, సమీరా, సోమేష్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య పాఠశాల వద్ద ధర్నా

శ్రీ చైతన్య పాఠశాలలో సీజ్ చేసిన రూము నుంచి బుక్స్ దొంగతనంగా తరలించిన యాజమాన్య తీరుకు నిరసనగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాఠశాల వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పలు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తూ బుక్స్ అమ్ముతున్నారని, దీనిని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పలుచోట్ల పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించి సీజ్ చేయించామని తెలిపారు. అదే సందర్భంలో అయ్యన్నపేట జంక్షన్ లో ఉన్న శ్రీ చైతన్య పాఠశాల కూడా పుస్తకాలు అమ్ముతుండంతో అధికారులు సీజ్ చేశారన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఆ రూము నుంచి ఎటువంటి పుస్తకాలూ తరలించబోమని యాజమాన్యం రాతపూర్వకంగా తెలిపిందన్నారు. కానీ నిబంధనలు తుంగలోకి తొక్కుతూ ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఆ రూములో ఉన్న పుస్తకాలన్నింటినీ అక్కడి నుంచి పాఠశాల యాజమాన్యం తరలించడం ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని అన్నారు. ఇప్పుడు కూడా రూమ్‌లో పుస్తకాలు మాయమయ్యాయని డిఇఒకు సమాచారం అందిస్తే ఎంఇఒను పంపిస్తానని చెప్పడం , ఎంఈఓ గారు గడపగడపకు కార్యక్రమంలో ఉన్నందున రాలేనని చెప్పడం చూస్తే అధికారులు ఈ పాఠశాలకు ఏ విధంగా కొమ్ముకాస్తున్నారో అర్థమవుతోందన్నారు. ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించిన ఈ పాఠశాలను తక్షణమే అధికారులు సీజ్ చేయాలని, పాఠశాలకు సహకరించిన అధికారులను జిల్లా విద్యా యంత్రాంగం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎం.హర్ష , జె. రవికుమార్, ఎం.సౌమ్య, బి.లక్ష్మణరావు జిల్లా కమిటీ సభ్యులు సమీరా , రమేష్ ,అర్జున్ జిల్లా నాయకులు కళ్యాణి సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించడమే లక్ష్యం

వ్యవసాయశాఖ జెడి విటి రామారావు

ప్రజాశక్తి-విజయనగరం

రైతులకు నాణ్యమైన ఉత్పాదకాలను అందిండమే ప్రభుత్వ లక్ష్యమనిజిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు అన్నారు. జిల్లాలో వ్యవసాయ శాఖ, విజిలెన్స్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో గల వివిధ విత్తనాల, ఎరువులు, పురుగు మందుల ప్రైవేటు డీలర్ల సమావేశం జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జరిగింది.సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాబోతున్న తరుణంలో రైతులకు నాణ్యమైన కల్తీ లేని విత్తనాలు ఎరువులు పురుగుమందులు అందించడం డీలర్ల ప్రథమ కర్తవ్యంగా గుర్తించాలని అన్నారు. ఎస్‌హెచ్ఒ, మండల వ్యవసాయ అధికారితో కూడిన బృందం, విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు డీలర్ పాయింట్లను తనిఖీ చేస్తారని తెలిపారు. జిల్లా సరిహద్దుల నుంచి నకిలీ విత్తనాలు, రువులు వచ్చే అవకాశం వున్నందున జాగ్రత్త వహించాలని కోరారు. విజిలెన్సు డిఎస్‌పి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ నాణ్యతలేని కల్తీ విత్తనాలు గాని పురుగుమందులు గాని ఎరువులు గాని విక్రయించినట్లు సమాచారం అందితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. విజయనగరం పురుగుమందుల డీలర్ల సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తాము నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను రైతులకు అందిస్తామని తెలిపారు.

నేడు పనిచేయనున్న విద్యుత్తు బిల్లుల కౌంటర్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలోని గల అన్ని విద్యుత్ రెవిన్యూ కార్యాలయాల్లోని విద్యుత్ బిల్లులు వసూళ్ల కౌంటర్లు గురు వారం సెలవు రోజుకూడా పనిచేస్తాయని విద్యుత్తుశాఖ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు తెలిపారు. విద్యుత్ రెవిన్యూ కార్యాలయలతో పాటు, ఎపిఇపిడిసియల్ సెక్షన్ ఆఫీస్ కలెక్షన్ కౌంటర్లు, ఎటిపి సెంటర్ లలో కూడా ఈ ఆదివారం కూడా చెల్లించవచ్చునని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు అందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న పలు ప్రజాసంఘాల నాయకులు

పెంచిన విద్యుత్తు ఛార్జీలు ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ట్రూ అప్ ఛార్జీల పేరుతో పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే ఉప సంహరించుకోవాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం చేసింది. పట్టణ పౌర సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు కంది త్రినాథ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యదర్శి రెడ్డి శంకరరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కుమ్మక్కై విద్యుత్ ఛార్జీలను అమాంతంగా పెంచి ప్రజలపై రూ.1400కోట్లభారం మోపుతున్నాయని అన్నారు. ప్రజలు ఇప్పటివరకు కరెంట్ బిల్లు చెల్లించినా, సర్దుబాటు ఛార్జీలు పేరుతో రూ.6వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని అన్నారు. ఈ భారాలకు వ్యతిరేకంగా ప్రజలంతా పోరాడాలన్నారు. సాయి అమృతా రెసిడెన్సీ కార్యదర్శి యుఎస్ రవికుమార్ మాట్లాడుతూ 1999లోనే విద్యుత్ సంస్కరణలను కేంద్రలోని వాజ్‌పాయి ప్రభుత్వం ప్రారంభించిం దని, నేడు మోడీ ప్రభుత్వం వేగంగా అమలు చేస్తోందని తెలిపారు. ఛాంబర్ అఫ్ కామర్స్ ఉపాధ్యక్షులు వి.సతీష్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు విధానాన్ని తిప్పికొట్టాలని అన్నారు. అయ్యప్పనగర్ కాలనీ కార్యదర్శి సుదీర్ మాట్లాడుతూ సర్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీల పేరుతో పెంపు జరుగుతోందన్నారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్ మాట్లాడుతూ దళితులకు ఇచ్చే విద్యుత్తు సబ్సిడీని ఎత్తివేస్తున్నారని తెలిపారు. రజక సంఘం జిల్లా నాయకులు భాస్కరరావు.చిన్నా, నాలుగోతరగతి ఉద్యోగుల సంఘం నాయకులు ప్రసాద్, ఐద్వా జిల్లాకార్యదర్శి పి. రమణమ్మ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఎస్ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్. ఎల్‌బిజి నగర్ కార్యదర్శి బి.రమణ, సిఐటియు నాయకులు జగన్మోహన్, వెంకట రావు, ఐద్వా నాయకులు వి.లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

బొబ్బిలి: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని డిఎస్‌పి పి.శ్రీధర్ అన్నారు. ఈనెల 26న విజయనగరంలో జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీలలో విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఆయన బుధవారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీలలో నవతేజాయుడు గోల్డ్ మెడల్ సాధించగా సూర్యకాంత్, గిరీశ్, క్రిష్ణ, సుజన, శ్రుతి సిల్వర్ మెడల్, లోకేష్, హేమంత్, వంశీ, చరణ్, శ్రీకర్ బ్రాంజ్ మెడల్ సాధించారన్నారు. వీరంతా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ సుధాకర్ చెప్పారు. వీరిని డిఎస్‌పి శ్రీధర్ అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారుడు పి.రాజ్ కిరణ్ పాల్గొన్నారు.

రికార్డుల ఆధారంగా భూ సర్వే

రేగిడి : రైతుల భూ రికార్డు ఆధారంగా భూ సర్వే నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ టి కళ్యాణ చక్రవర్తి అన్నారు. బుధవారం మునకలవలస, వసనవలస గ్రామాల్లో భూ రీ సర్వే పై గ్రామ సభలు నిర్వహించారు. రైతులు భూ సర్వేకు వచ్చే వారి పొలం వద్ద రికార్డు ఆధారంగా హాజరై సక్రమంగా నమోదు చేయించుకోవాలని కోరారు. గ్రామ సభలో భూ సర్వే పై రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా భూ సర్వే నిర్వహిస్తామని చెప్పారు. అందుకు ప్రతి రైతు రెవెన్యూ, సర్వేయర్లకు సహకరించాలని కోరారు.

'ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నాం'

బొబ్బిలి: బలిజిపేట రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేస్తామని ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు అన్నారు. బలిజిపేట రోడ్డు విస్తరణ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వస్తే రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేస్తామని ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేశామన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు ఇవ్వడంతో పాటు అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

ఏకలవ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

బాడంగి: ఈ నెల 29వ తేదీన జరిగే ఏకలవ్య దినోత్సవాన్ని జిల్లా అంతటా ఘనంగా నిర్వహించాలని జిల్లా ఏకలవ్య అధ్యక్షుడు పాలవలస గౌరు అన్నారు. ఆయన తని నివాసం ఎరుకులపాకలో బుధారం విలేకర్లతోత మాట్లాడారు. ఏకలవ్య జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టి ఎరుకల కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని తీర్మానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య కులస్తులందరూ అన్ని మండలాల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న గౌరు

ఎన్‌ఎంఎంఎస్‌కు మౌలిక ఎంపిక

గుర్ల : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన రొంగలి మౌలిక ఎన్‌ఎంఎంఎస్ తుది ఫలితాల్లో మండల స్థాయిలో ఓపెన్ కేటగిరీలో స్కాలర్ షిప్ సాధించిన ఏకైక విద్యార్థినిగా నిలిచింది. విద్యార్థిని అభినందిస్తూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమా మహేశ్వరరావు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థిని తల్లిదండ్రులు ఎన్‌ఎంఎంఎస్ కోసం ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు జి.శ్రీరామ్మూర్తి మాస్టారును సన్మానించారు.

మౌలిక

కెజిబివిని సందర్శించిన ఎంఇఒ

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట వద్ద గల కస్తూరిబా బాలికల వసతి గృహాన్ని ఎంఇఒ పి. బాల భాస్కర్ బుధావరం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఇస్తున్న మెనూ రికార్డును పరిశీలించారు. వసతి గృహం ఆవరణంతా పరిశీలించి వసతి గృహంలో చదివిన ప్రతి విద్యార్థిని ఉన్నత స్థాయికి వెళ్లాలన్నారు. బాగా చదువుకుని వసతిగృహానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ పరిశీలనలో కెజిబివి వసతి గృహం ఎస్ఒ కిరణ్మయి పాల్గొన్నారు.

మరిడిమాంబ తొలేళ్ల సంబరం

వేపాడ : మండలంలోని వావిలిపాడు గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి తొలేళ్ల సంబరం బుధవారం వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా గ్రామ పురవీధుల్లో అమ్మవారిని మేళ తాళాలు, భాజా భజంత్రీలతో ఊరేగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బీల రాజేశ్వరి మాట్లాడుతూ గురువారం అనుపోత్సవం అతి వైభవంగా నిర్వహిస్తామన్నారు. శుక్రవారం ఎడ్ల పరుగు ప్రదర్శన నిర్వహిస్తామని చెప్పారు.

30న ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్ష

వేపాడ: మండలంలోని బక్కు నాయుడుపేట వద్దగల ఎపి ఆదర్శ పాఠశాలలో 7,8,9 తరగతులలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న వారికి రు ఈనెల 30వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రిన్సిపల్ ఆర్. ఈశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు హాల్ టికెట్, ఆధార్ కార్డు పట్టుకొని పరీక్షకు హాజరు కావాలని ఆయన కోరారు.

సిఎంను సత్కరించిన డిసిఎంఎస్ ఛైర్‌పర్సన్

విజయనగరం టౌన్: కురుపాం విచ్చేసిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని డిసిఎంఎస్ ఛైర్‌పర్సన్ అవనాపు భావన, వైసిపియువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి అవనాపు విక్రమ్ దంపతులు కలిసి సత్కరించారు. సభా వేదికపై సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

వరలక్ష్మికి రెడ్‌క్రాస్ పురస్కారం

విజయనగరం : సీతం ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ ఎం.వరలక్ష్మికి రెడ్ క్రాస్ సొసైటీ ప్రశంసా పత్రంతో అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ్ రావు మాట్లాడుతూ, తమ కళాశాల ఎన్‌సిసి బృందం అన్ని సామాజిక సేవలలోను ముందుంటుందని తెలిపారు.రక్తదాన శిబిరాలు నిర్వహించడంలో ఇటువంటి గుర్తింపు రావడం ఆనందంగా ఉందన్నారు. ఈసందర్భంగా వరలక్ష్మిని శశిభూషణరావుతో పాటు కరస్పాండెంట్ బొత్స ఝాన్సీలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్ వెంకటలక్ష్మి, గ్రంథాలయ అధికారి లెంక సత్యవతి అభినందించారు.

పివి నరసింహారావు చిరస్మరణీయుడు

విజయనగరం టౌన్: మాజీ ప్రధాని పివి నరసింహారావు చిరస్మరణీయులని కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు పేర్కొన్నారు. పివి 102వ జయంతి వేడుకలు బుధవారం పట్టణంలో ఘనంగా జరిగాయి. జిల్లా బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అశోక్ గజపతి రాజు పాల్గొని నరసింహారావు చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రముఖ రచయిత శంకర్ నీలు రచించిన పివి నరసింహారావు ఆత్మకథ పుస్తకాన్ని అశోక గజపతి రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పివి బహు భాషా కోవిదులని, రాజనీతిజ్ఞుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పేరి రామయ్య పంతులు, సిటీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ద్వాదశి వేణు, రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఉపాధ్యక్షుడు ఇనుగంటి రాకేష్ శర్మ, ప్రైవేట్ అర్చక పురోహిత సంఘం జిల్లా అధ్యక్షులు చల్లాపిళ్ళ విశ్వేశ్వర శాస్త్రి,జిల్లా ప్రధాన కార్యదర్శి మర్ల రవికుమార్, బ్రాహ్మణ ఐక్యవేదిక అధ్యక్షులు రాజకామేశ్వరరావు పాల్గొన్నారు.

బొబ్బిలి: మాజీ ప్రధాని పివి నర్సింహారావు జయంతి కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పిసిసి సభ్యులు ముచ్వల శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పివి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు, కాంగ్రెస్ నాయకులు రవి, జగదీష్, ప్రకాశరావు, కృష్ణ, నారాయణ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్ ఢీకొని లారీ క్లీనర్ దుర్మరణం

ప్రజాశక్తి - రామభద్రపురం

జాతీయ రహదారి ఆరికతోట ధాబా వద్ద గ్యాస్ ట్యాంకర్ లారీ ఢీ కొని ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన క్లీనర్ దినేష్(45) మృతి చెందాడు. ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపిన వివరాల మేరకు.. గ్యాస్ లోడ్‌తో విశాఖకు వెళుతూ విశ్రాంతి కోసం ధాభా వద్ద టాంకర్‌ను నిలుపు చేసే క్రమంలో డ్రైవర్‌కు డైరెక్షన్ చెబుతున్నాడు. డ్రైవర్ సరిగా గమనించకుండా వెనుకకి మళ్ళించే ప్రయత్నంలో దినేష్ యాదవ్ ను వెనుక భాగం ఢీ కొనడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ దుర్ఘటనను గమనించి స్థానికులు కేకలు వేసినప్పటికీ ఫలితం లేకపోయింది. మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం బాడంగి సిహెచ్‌సికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు

అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఆకుల సీతంపేట గ్రామంలో ఏ విధమైన అనుమతులూ లేకుండా అక్రమంగా మద్యం అమ్ముతున్న మజ్జి కనక మహాలక్ష్మిని బుధవారం అరెస్టు చేశామని ఎస్ఐ రాజేష్ తెలిపారు. ఆమె వద్ద నుంచి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ దాడిలో మహిళా కానిస్టేబుల్ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ ఆణిముత్యం కావాలి

- అమ్మ ఒడి కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి
- 1,66,180 మంది విద్యార్థులకు రూ.249.27కోట్లు పంపిణీ

ప్రజాశక్తి-గజపతినగరం

విద్యారంగంలో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకొని, ప్రతి విద్యార్థి ఆణిముత్యం కావాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అధ్యక్షతన జిల్లా స్థాయి అమ్మ ఒడి పంపిణీ కార్యక్రమం గజపతినగరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగింది. జిల్లాలోని లక్షా 66వేల 180 మంది విద్యార్థులకు రూ.249.27కోట్ల రూపాయల విలువైన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. విద్యార్థులంతా వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు కూడా మరింత అంకితభావంతో పనిచేసి, ఉత్తమ ఫలితాలను సాధించాలని సూచించారు. టెన్త్, ఇంటర్‌లో అత్యధిక మార్కులను సాధించిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలుగా ఎంపిక చేసి, ఇటీవలే సత్కరించడం జరిగిందని, వారిని స్ఫూర్తిగా తీసుకొని ప్రతీ విద్యార్థీ ఆణిముత్యంగా ఎదిగేందుకు కృషి చేయాలని కోరారు.



అమ్మఒడి చెక్కును తల్లులకు అందిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మాట్లాడుతూ, బాలబాలికలంతా చదువుకోవాలన్న గొప్ప ఉద్దేశంతో అమ్మ ఒడి పథకాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి ప్రవేశపెట్టారని అన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ముందుకు వెళ్లాలంటే మంచి చదువులు అందించడమే మార్గమన్నది ముఖ్యమంత్రి అభిప్రాయంగా పేర్కొన్నారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని అన్నారు. ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ, పిల్లలకు గొప్ప భవిష్యత్తు ఇవ్వడానికి వేల కోట్ల రూపాయలను వెచ్చిస్తున్నారని చెప్పారు. ఎంఎల్‌సి డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి మన విద్యారంగంలో గొప్ప సంస్కరణలకు శ్రీకారం చుట్టి, చదువుకోవడానికి సకల సదుపాయాలను కల్పించారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి, డిఎల్‌డిఒ రవీంద్ర, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

డిఎంహెచ్ఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - బొండపల్లి

మండలంలోని వెదుర్లాంలో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ప్రోగ్రామ్‌ను డిఎంహెచ్‌ఒ ఎస్.భాస్కర్ రావు తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఈ ఆశా యాప్‌ను ఎఫ్ డిసిను, మందుల పంపిణీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఎన్ సిడి, సిడి హెల్త్ ఐడిను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సత్యనారాయణ, సర్పంచ్ శ్రీనివాసరావు, సిసి నాయుడు, హెల్త్ సూపర్ వైజర్ వర్మ, ఎమ్‌ఎల్‌హెచ్ పిసిహెచ్ హరిక, హెల్త్‌అసిస్టెంట్ బి.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - గజపతినగరం

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరమని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎంఎస్‌వి రవి ప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని పురిటి పెంట గ్రామంలో గల అంగన్వాడి-3లో అంగన్వాడి సిబ్బందికి అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఏ విధంగా స్పందించాలో అవగాహన కల్పించారు. అగ్నిమాపక పరికరాలను సకాలంలో ఏ విధంగా వినియోగించాలో ఆచరణాత్మకంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేల పేరుతో పికె టీమ్ వసూళ్లు..!

ప్రజాశక్తి- డెంకాడ

రాబోయే 2024 ఎన్నికలకు వైసిపి వివిధ రకాల టీమ్‌ల పేర్లు చెప్పి గ్రామాల్లో సర్వేలు నిర్వహిస్తోంది. ఈ సర్వేల వల్ల గ్రామాల్లో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నామని వైసిపి నాయకులు చెబుతున్నారు. మండలంలో సుమారు అన్ని గ్రామాల్లో పీకే టీమ్, ఐప్యాక్ టీమ్ ఇలా వివిధ రకాల టీమ్‌లు పేర్లు చెప్పి సర్వేలు చేస్తున్నారు. ఈ క్రమంలో గ్రామంలో ఉన్న వైసిపి నాయకులను కలిసి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిస్తోంది. కొంత మంది తమ ఎకౌంట్లో డబ్బులు వేయమంటున్నారు. భోజనాలు కూడా పెట్టమంటున్నారు. ఇద్దరు ముగ్గురు భోజనాల కోసం పది మందికి నాయకుల వద్ద వసూలు డబ్బులు వసూలు చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా చేస్తే మీ గ్రామాల్లో పరిస్థితి వైసిపికి అనుకూలంగా సర్వే చేస్తామని లేకపోతే మీ గ్రామాల్లో వైసిపి పరిస్థితి బాగోలేదని

వైసిపి నాయకుల ఆందోళన

నాయకుల పరిస్థితి అధ్వానంగా ఉందని సర్వే రిపోర్టు ఇస్తామని రకరకాలుగా నాయకులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. దీంతో నాయకులు వైసిపి సర్వే టీమ్‌ల పేర్లు చెప్పగానే భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇవేమి టీమ్‌లురా బాబోయ్ అని గగ్గోలు పెడుతున్నారు. మండలంలో పది రోజుల క్రితం సింగవరం, నాతవలస గ్రామాల్లో వైసిపి ఆధ్వర్యంలో వివిధ రకాల టీమ్‌లు సర్వేలు నిర్వహించాయి. అయితే ఆ గ్రామాల్లో నాయకుల వద్ద కొంత మొత్తంలో డబ్బులు వసూలు చేశారు. ఇలా సర్వేల పేర్లు చెప్పి డబ్బులు వసూలు చేయడం ఏంటని నాయకులు వాపోతున్నారు. ఇప్పటికైనా సర్వేలు చేస్తున్న టీములపై అధినాయకులు దృష్టి సారించాలని మండల వైసిపి నాయకులు కోరుతున్నారు.

విద్యుత్తు భారాలపై 30న ధర్నా

ప్రజాశక్తి- బొబ్బిలి

విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్ల ముప్పుపై ఈ నెల 30న బొబ్బిలి డిఇ ఆఫీస్ ముందు నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని వామపక్ష నాయకులు కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో బుధవారం వామపక్ష నాయకులు మీడియాతో మాట్లాడారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పి. శంకరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలలో భాగంగా విద్యుత్తు పంపిణీ అంతా ఆదానికి కట్టబెట్టాలని మోడీ ప్రభుత్వం చూస్తుందన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఫిక్స్‌డ్, కస్టమర్, ట్రూ ఆఫ్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలు వేసి కరెంటు చార్జీలు పెంచుతున్నారన్నారు. దీనివల్ల అన్ని రకాల వస్తువు ధరలు పెరుగుతాయని, ఫెర్రోఎల్లాస్ కంపెనీ లాంటివి జులై 15 నుండి మూసివేస్తున్నామని యాజమాన్యాలు ప్రకటించాయని గుర్తు చేశారు. దీని వల్ల వేలాదిమంది కార్మికులు రోడ్డున పడతారన్నారు. దీనికి తోడు స్మార్ట్ మీటర్ల ప్రమాదం ప్రజలపై పడబోతుందని ముందుగా డబ్బులు చెల్లించే రీచార్జి విధానం రాబోతుందని తెలిపారు. ఈ దుర్మార్గమైన విద్యుత్తు బారాలకు వ్యతిరేకంగా జూన్ 30 ఉదయం10 గంటలకు బొబ్బిలి కోటి చెరువు దరి ఎలక్ట్రికల్ డిఇ ఆఫీస్ ముందు జరిగే ధర్నాలో అన్ని వర్గాల ప్రజానీకం పాల్గొవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు వి. కృష్ణ, పీకేఎస్ జిల్లా నాయకులు టి. అప్పలనాయుడు, సిపిఎం బొబ్బిలి మండల కార్యదర్శి ఎస్ గోపాల్, బూర్జవలస సిపిఎం కార్యదర్శి జి. అప్పలనాయుడు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: పెంచిన విద్యుత్ ఛార్జీలకు నిరసనగా ఈ నెల 30న స్థానిక సబ్ స్టేషన్ వద్ద అఖిల పక్షం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు కిల్లంపల్లి రామారావు కోరారు. బుధవారం నగర పంచాయతి పరిధి జరజాపు పేటలో విద్యుత్ ఛార్జీల పెంపుకు నిరసనగా అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం విద్యుత్ బిల్లులు పెంచి వినియోగ దారులపై భారంమోపడం దారుణమన్నారు. గతంలో 300, 500 బిల్లులు వచ్చిన వారికి 1000 నుంచి 2000 రూపాయల వరకు విద్యుత్ బిల్లులు రావడం అన్యాయమన్నారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు మొయిద పాపారావు, న్యూ డెమోక్రసీ నాయకులు కాళ్ల అప్పలసూరి, టిడిపి నాయకులు బొలే కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- బొబ్బిలి రూరల్

రైతాంగ సమస్యలను పరిష్కరించాలని ఈనెల 30న విజయవాడలో జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం పిలుపునిచ్చారు. ధర్నా గోడపత్రికలను బుధవారం ఎం.బూర్జవలసలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న వైసిపి రైతులు సమస్యలను పరిష్కరించడంలో విఫలమవుతుందన్నారు. వ్యవసాయ పెట్టుబడులు పెరుగుతున్నా గిట్టుబాటు ధరలు పెరగకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో పంట నష్టపోయిన రైతులందరికీ ఇన్‌ఫుట్ సబ్సిడీ ఇవ్వాలని, పంటల బీమా ఇవ్వాలని, వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాను రైతులు జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు జి.అప్పల నాయుడు, జి.స్వామినాయుడు, టి.సత్యం, పాల్గొన్నారు.

శృంగవరపుకోట: రైతాంగ సమస్యల పరిష్కారానికి జూన్ 30న విజయవాడలో జరిగే మహాధర్నాకు సంబంధించిన గోడపత్రికను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మద్దిల రమణ పట్టణంలోని కర్ణాటక కల్లాల వద్ద రైతులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది పంటలు నష్టపోయిన రైతులందరికీ ఇన్పుట్ సబ్సిడీ పంటల బీమా వెంటనే విడుదల చేయాలన్నారు. రైతు తన వ్యవసాయానికి అయిన ఖర్చుకు అదనంగా 50శాతం కలిపి కనీసం మద్దతు ధర నిర్ణయించాలని డిమాండ్ చేశారు. రైతులకు సంబంధించిన సమస్యలపై నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె. జగ్గారావు, సిహెచ్ జగ్గారావు, కే సత్యవమ్మ, పి సన్యాసమ్మ, వై నాయుడు, రమణమ్మ, వెంకటలక్ష్మి, సిహెచ్ సన్యాసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతులు

సమస్యలు పరిష్కరించేందుకే గడపగడపకు

ఎమ్మెల్యేలు బొత్స, బడ్డుకొండ

ప్రజాశక్తి - భోగాపురం

ప్రజా సమస్యల పరిష్కరించేందుకే గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. బుధవారం కొంగవానిపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికి పర్యటించారు. గ్రామంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల అందుతున్న తీరును, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా జగనన్న ఇల్లులు అందలేదని, ఇల్లు నిర్మించుకున్న వాటికి బిల్లులు కూడా మంజూరు కాలేదని, తాగునీటి సమస్య అధికంగా ఉందని పలువురు మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించామని త్వరలో సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. ఇళ్ల పట్టాల వచ్చేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సూర్యనారాయణ, మత్స్య కార్పొరేషన్ డైరెక్టర్ మైలపల్లి నరసింహులు, వాసుపల్లి రొయ్యుడు, వైసిపి నాయకులు పడాల భాను, కర్రోతు శ్రీనివాసరావు, పోతిరెడ్డి గోపి, తహశీల్దార్ బంగార్రాజు, సూరాడ చిన్నారావు, ఎంపిడిఒ అప్పలనాయుడు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంట్యాడ : రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మరిన్ని పథకాల పొందాలని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య అన్నారు. బుధవారం మధ్యాహ్నం పెదవేమలి గ్రామంలోని గడపగడపకు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అర్హత ఉండి పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకురావాలన్నారు. బీసీ కాలనీలో విద్యుత్ స్తంభాల కొరత అధికంగా ఉందని స్తంభాలు వేయాలని ఎఇ ప్రసన్నకుమార్‌కు ఆదేశించారు. ఇల్లులు అవసరమైన వారికి వెంటనే మంజూరు చేయాలని గృహ నిర్మాణ శాఖ అధికారి రాజగోపాల్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పి సురేష్ బాబు, జెడ్‌పిటిసి వర్రి నరసింహమూర్తి, ఎంపిపి పీరుబండి హైమావతి, ఎస్‌సి సెల్ అధ్యక్షులు పీరుబండి జైహింద్ కుమార్, ఎంపిడిఒ భాను విజయరావు, గ్రామ సర్పంచ్ వర్రి పాపునాయుడు, ఎంపిటిసి పొడుపు రెడ్డి హైమావతి, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

'గడపగడపకు' పనులకు రూ.33 కోట్లు

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

ఇప్పటి వరకు జిల్లాలో రూ.33.3 కోట్లతో గడప గడప పనులు మంజూరు అయ్యాయని పంచాతీ రాజ్ ఎస్ఇ గుప్తా తెలిపారు. బుధవారం స్థానిక మండలం పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నియోజకవర్గం స్థాయి సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతు గ్రామ సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్‌లు, ఆర్బికె లు సెప్టెంబర్ నాటికి పూర్తి చెయ్యాలని సిబ్బందిని ఆదేశించారు.

530 సచివాలయాలు

జిల్లాలో 530 సచివాలయాలు, 496 ఆర్బికెలు, 435 వెల్ నెస్ సెంటర్లుకు గాను రూ.194 కోట్లుతో పనులు చేపడుతున్నా మని తెలిపారు. సచివాలయాలు 530కి గాను 379, 496 ఆర్బికె లకు గాను 275, 435వెల్ నెస్ సెంటర్‌లకు గాను 179 పూర్తయ్యాయన్నారు. వీటికి రూ. 89 కోట్లు బిల్లులు చెల్లించామని ఆయన అన్నారు. ఇంకా రూ. 5 కోట్లు చెల్లించాల్సి ఉందని చెప్పారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఇ గుప్తా

నాబార్డ్ నిధులతో గ్రామీణ రోడ్లు

గ్రామీణ రహదారులకు రూ.60 కోట్లు మంజూరయ్యాయని అవసరం వున్నా చోట్ల ప్రతి పాదనలు తయారు చేసి మంజూరు చేస్తామన్నారు. అనంతరం బొబ్బిలి పంచాయితీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రూ. 3 లక్షలు జిల్లా పరిషత్ నిధులతో మరమ్మత్తులు చేయించామన్నారు. ఆయనతో పాటు ఈఈ శ్రీనువాసరావు, డిఇ అప్పారావు, ఎఇలు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ముకుందపురం, పాటూరు, కరిగిపాలెం గ్రామాల్లో విస్తృతంగా జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల ఒకటో తేదీ నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభమవుతోందన్నారు. అర్హత ఉండి గతంలో ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించి ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలు వచ్చేలా సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. అనంతరం అరిగిపాలెం గ్రామంలో ఎస్‌డబ్ల్యుపి షెడ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సంధ్య, యశోద, రవి, గ్రామ పెద్దలు సన్యాసిరావు, వెంకటరావు, వంటాకు శ్రీను, కనకరావు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: జగనన్న సురక్ష కార్యక్రమం పై ఇంటింటికీ వెళ్లి వివరించాలని నగర పంచాయతి ఛైర్‌పర్సన్ బంగారు సరోజినీ సూచించారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వచ్చే నెల 4 నుండి 22 వరకు నగర పంచాయతీ పరిధి 8వ వార్డు సచివాలయాల్లో నిర్వహించబోవు జగనన్న సురక్ష కార్యక్రమంలో చేపట్టనున్న 11సర్వీసులను ప్రతి ఇంటికి వెళ్ళి వివరించాలన్నారు. సర్వీసులకు సంబంధించిన అన్ని రకాల డాక్యుమెంట్లను సేకరించి కార్యక్రమం నిర్వహించే రోజున జారీచేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పథకం అందేలా కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో మేనేజర్ టి.వి.ఎస్.విశ్వేశ్వర రావు,సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రి సందర్శన

ప్రజాశక్తి - గజపతినగరం

స్థానిక ఏరియా హాస్పిటల్‌ను బుధవారం డిసిహెచ్‌ఎస్ డాక్టర్ గౌరీశంకర్ సందర్శించారు. నూతన భవన నిర్మాణం చురుగ్గా కొనసాగుతున్నట్లు గమనించి, పనివారిని పిలిచి ఆసుపత్రికి అత్యవసరమైన నిర్మాణాల విషయంలో కొన్ని సూచనలు చేశారు. అనంతరం నూతనంగా ప్రారంభించిన ఫిజియోథెరపీ విభాగాన్ని, అల్ట్రాసౌండ్ పరికరాన్ని పరిశీలించారు. వైద్యసేవలు పూర్తిస్థాయిలో అందించేందుకు కావలసిన అన్ని సదుపాయాలు సమకూరుస్తామని చెప్పారు. మార్చురీ గది నిర్మాణం వీలైనంత త్వరగా పూర్తిచేయాలని డిఇని కోరతానని అన్నారు. ఎక్స్‌రే, ఆపరేషన్ థియేటర్, లాబొరేటరీ సేవల గురించి పూర్తి సమాచారం రాబట్టారు. ఆయనతో పాటు హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్, డాక్టర్ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న డిసిహెచ్‌ఎస్

జామికి జూనియర్ కాలేజీ మంజూరు

ప్రజాశక్తి - జామి

జామికి జూనియర్ కళాశాల మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత చిరకాల వాంఛగా ఉన్న విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే జూనియర్ కళాశాల ఏర్పాటు కలగా మారింది. గతంలో జూనియర్ కాలేజీ ఏర్పాటుకు స్థానిక ఉద్యోగులు, ఉపాధ్యాయులు, యువకులు కాలేజీ సాధన కమిటీ ఏర్పాటు చేసి, పోరాడారు. స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ముఖ్యమంత్రి దృష్టికి కాలేజీ ఆవశ్యకతను వివరించారు. తాజాగా ముఖ్యమంత్రి రాష్ట్రంలో 213 జూనియర్ కాలేజీలు మంజూరు చేసినట్లు ప్రకటన చేశారు. మండలంలో మోడల్ స్కూళ్లలేని చోట, కో - ఎడ్యుకేషన్ అవకాశం ఉన్న మండలాల ప్రాతిపదికన జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. దీంతో జామి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల వస్తుందని నాయకులు చెబుతున్నారు. ఇప్పటికైనా జామికి కళాశాల మంజూరుపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. కానీ ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ప్రారంభమవుతాయా...? లేదా అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఒకవేల వచ్చే ఏడాది నుంచి తరగతులు ప్రారంభమవుతాయంటే మళ్ళీ కథ కంచెకే అన్న సందేహాలు ఉన్నాయి.

టిడిపిలో 50 కుటుంబాలు చేరిక

భోగాపురం : మండలంలోని తూడెం గ్రామంలో వైసిపికి చెందిన 50 కుటుంబాలు టిడిపి తీర్థం పుచ్చుకున్నాయి. మాజీ సర్పంచ్‌లు రీసు నర్సిమ్మ, పూడి రామయ్యమ్మ, మాజీ వార్డు సభ్యులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు టిడిపి నియోజకవర్గం ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు, టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి తీరు బాగోలేదని, ఏ విషయానికి నాయకులు సక్రమంగా స్పందించడం లేదని పార్టీ విధానాల నచ్చక మారిపోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ సీనియర్ నాయకులు నీలాపు అప్పలరామి రెడ్డి, కోరాడ తాతారావు, గ్రామ టిడిపి అధ్యక్షులు రీసు రమణ, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కర్రోతు రాజు, మండల పార్టీ ఉపాధ్యక్షులు కోలా రామసురి, మండల తెలుగుయువత అధ్యక్షులు సరగడ తోగులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిందు, తుంపర్ల సేద్యంతో నీరు ఆదా

ప్రజాశక్తి- మెరక ముడిదాం

ప్రభుత్వం సూక్ష్మ నీటి పారుదల పథకం ద్వారా సరఫరా చేసే బిందు, తుంపర్ల నీటి సేద్య పరికరాలతో రైతుకు సాగు నీరు, కూలీ ఖర్చు ఆదా అవుతుందని, దీని వల్ల పంట సాగు విస్తీర్ణంను పెంచ వచ్చునని ఎపిఎంఐపి పథక సంచాలకులు పిఎన్‌వి లక్ష్మి నారాయణ అన్నారు. మండలంలోని ఉత్తరవిల్లి గ్రామంలో బుధవారం 15 మంది రైతులు 30 ఎకరాల్లో ఏర్పాటు చేసిన నీటి సేద్య పరికరాలను రైతులు వినియోగించు విధానాన్ని ఆయన తనిఖీ చేశారు. 2023-24ఆర్థిక సంవత్సరానికి గాను 3వేల ఎకరాలలో 1100 మంది రైతులకు రూ.687.17లక్షలు విలువైన సూక్ష్మ నీటి సేద్య పరికరాలను రాయితీ పై సరఫరా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం నిర్దేసించిందని తెలిపారు. మండలంలోని 46మంది రైతులను గుర్తించి వారికి రూ.28.63లక్షలు విలువైన బిందు, తుంపర్ల సేద్య పరికరాలను రాయితీ పై సరఫరా చేయడానికి కలెక్టర్ ఎంపిక చేశారన్నారు. ఆర్‌బికెల్లో రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ తనిఖీ కార్యక్రమంలో వైస్ ఎంపిపి తలచుట్ల హరిబాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు మర్రాపు వెంకటరమణ, సీర రాజేష్, జిల్లా కో -ఆర్డినేటర్ రుంగ్తా, మైక్రో ఇరిగేషన్ కంపెనీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థినులకు ప్రభుత్వం సరఫరా చేసిన ద్వితీయ సంవత్సరం పాఠ్యపుస్తకాలను బుధవారం పంపిణీ చేశారు. ఎంఇఒ పి సత్యనారాయణ, పిఎంసి ఛైర్మన్ తగరంపూడి రమణ చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల బాలికలు ప్రభుత్వం అందించిన పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్ఛార్జి హెచ్‌ఎంఆర్‌విఎస్ఎన్ మూర్తి, కళాశాల అధ్యాపకులు పొట్నూరు శివాజీ, రహీమ్ షేక్ లాల్, తమ్మినాన రాజేష్, కోటంశెట్టి జయలక్ష్మి, ఎస్వీఎస్ఎన్ మూర్తి, అరసాడ సురేంద్రనాథ్, పాఠశాల ఉపాధ్యాయులు పొట్నూరు శ్రీరాములు, చలం తదితరులు పాల్గొన్నారు.

చిన్న, సన్నకారు రైతుల ఎంపిక

ప్రజాశక్తి- రేగిడి

పండ్ల తోటల పెంపకానికి చిన్న సన్న కారు రైతులను ఎంపిక చేసి వారి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఎపిఒ సంకాబత్తుల హరినాథ్ సూచించారు. బుధవారం ఉపాధి హామీ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని ఇంతవరకు పండ్ల తోటలు పెంపకానికి 19 ఎకరాలలో చిన్న, సన్నకారు రైతులను ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపించామన్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లో కాలువ పనులు పూర్తి చేయాలని సూచించారు. క్షేత్ర సహాయకులు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ఎంఎంఎస్ యాప్ ద్వారా వేతన దారుల వివరాలు అప్‌లోడ్ చేయాలని సూచించారు. హౌసింగ్‌లో 90 రోజులు పూర్తి చేసి బిల్లులు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఈసీ రామినాయుడు, సాంకేతి సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపిఒ హరినాథ్